
# బాలమిత్ర

జనవరి -1999






## గోరింటాకు తయారీ

సౌంధర్య కోసం ఎన్నో తపనలు. ఆడవాళ్ళు అందంకోసం ఏది చేసినా అందమే మరి. అందుకోసం ఎంతగానో కృషి చేస్తారు. తపన పడతారు. మంచి చీరలు, బొట్లు రకరకాల హెయిర్ స్టైల్స్, మేకప్‌లు ఒకటేమిటి కాటుక దిద్దడాల దగ్గర్నుంచి అందంగా తిలకం అమర్చటం, పూలు పెట్టుకోవడం, నగలు సింపుల్‌గా పెట్టుకోవటం వరకూ అన్నింట్లోనూ శ్రద్ధ, చూపిస్తారు. అయితే దానికి తగ్గట్లుగా చాలామంది నెలలో రెండుసార్లయినా తమ సౌందర్యాన్ని మరింతగా ఇనుమడింపచేయటం కోసం గోరింటాకుని, మెహెందీని, కోన్ ద్వారానూ, విడిగా పొడి రూపంలోనూ, లేదా ఆకురుబ్బుకునో, కష్టపడి మొత్తానికి ఎలా అయితేనేం గోరింటాకు అందంగా చేతులకీ కాళ్ళకీ తీర్చిదిద్దుకుంటారు. ఈ మధ్య హెన్నా కోసం గోరింటాకు పొడి, ఆకుల వాడకం ఎక్కువయిపోయి, అసలు చేతులకి అందంగా అమర్చుకుందామంటేనే ఖరీదు ఎక్కువనిపిస్తోంది కదూ! అంత ఖరీదు పెట్టి కొనుక్కోవాలన్నా, పెట్టుకోవాలన్నా కొందరికి మనసు ఒప్పదు కదా! అందుకని ఖర్చులేని, ఖర్చు తక్కువతో పావుగంటకే మెరూన్ కలర్‌తో శ్రమ, ఇబ్బంది లేకుండా ఈ మెహెందీని 'గోరింటాకు తయారీ'ని చూడండి.

బెల్లం వందగ్రాములు తీసుకుని పొడి కొట్టి ఒక డబ్బాకి సిరిలాక్ - ఫారెక్స్ వంటి డబ్బాలో లోపలి భాగాన చుట్టూ గోడలకి అతికించాలి. తర్వాత ఒక ఇత్తడి గిన్నెలో కొద్దిగా నీళ్ళుపోసి అందులో ఈ డబ్బాని మధ్యగా అమర్చి పైన మూతపెట్టి డబ్బాకి విడిగా ఆ తర్వాత పైన ఇత్తడి గిన్నె మీద నీళ్ళపళ్ళెం మూతగా ఉంచాలి. దీన్ని సన్నటి సెగమీద ఉంచాలి. ఈ నీళ్ళ ఆవిరికి బెల్లం కరిగి చిక్కటి, ఎర్రటి ముద్దగా పల్చగా - నీళ్ళుగాకాక మనం తడుపుకునే గోరిం

టాకుపిండిలా వస్తుంది. అప్పుడు దాంట్లో ఎర్ర కుంకం కొంచెంగా కలిపి చల్లారనిచ్చి ఓ సీసాలో పోసుకోవచ్చు. ఇది చేతులకీ కాళ్ళకీ పెట్టుకున్న పావుగంటకే మంచి రంగుతో పండి పదిహేను ఇరవై రోజులైనా చెక్కుచెదరకుండా వుంటుంది. ఫ్రిజ్‌లో ఉంచితే ఒకసారి తయారుచేసిన గోరింటాకు వందగ్రాముల బెల్లానికి నాలుగుసార్లు నలుగురు పెట్టుకునేంతగా వస్తుంది. చేసి పెట్టుకుని చూడండి. ఇత్తడి గిన్నెకీ బెల్లం అంటించి మధ్యలో ఒక కాళీ డబ్బా దానిపైన మూత ఉంచి ఆపైన నీళ్ళు పళ్ళెం పెట్టినా ఈ మెహిందీ కాళీ డబ్బానిండా వస్తుంది. ఇలాగా చేయవచ్చు. చేసి చూడండి ఈ సులభ మార్గంలో.

**'వ్యాసపరంపర'**

**'ఉపకార మనస్తత్వం ఉండాలి'**

మనిషి పుట్టుక పుట్టాక మంచి మర్యాద, మానవత్వం, ఉపకార మనస్తత్వం ఇవి ఉండాలి. ఇవి ఉంటేనే మానవత్వానికి మనిషికి విలువ. చాలామందిలో ఉపకారగుణం ఉండదు. ఎవరికి ఏది జరిగినా, ఎవరింట్లో ఏం జరిగినా, తమకేం పట్టనట్లు ఉంటారు. అలాంటివారు ఇతరుల నుంచి కూడా ఉపకారం పొందలేరు. సానుభూతి సంపాదించలేరు. మంచిమనిషి అని అనిపించుకోలేరు ఎవరిచేతా! కాబట్టి ఇతరుల మంచి చెడ్డలు అవసరాలు కూడా తమవిగానే భావిస్తూ చేతనయిన సహాయం అందించాలి. అప్పుడే మనిషిపుట్టుక ఉన్నతి అనిపించుకునేది. ఉదా: తెలుసున్న ఓ ఫ్యామిలీ ఉంది. ఎంతసేపూ తమ తిండీ, తమ గొప్పలు, తమ సరదాలే తప్ప ఇతరులు ఎలా పోయినా, ఎన్ని కష్టాలుపడుతున్నా పట్టించుకోరు. అయితే ఈ మధ్య ఆ ఇంటి యజమాని పోయాడు. ఊరికే చుట్టుప్రక్కల జనం చూడటానికి వెళ్ళారు. పరామర్శించి వచ్చారే కాని, ఆ తర్వాత ఎవరూ పలకరించలేదు, వెళ్ళలేదు. ఆవిడ ఒంటరిగా భర్తపోయిన బాధతో కుచించుకుపోతున్నా ఎవరి సానుభూతీ ఆమెకు దొరకలేదు. ఎందుకు? ఆమె గుణం, మనస్తత్వం, పిల్లికి బిచ్చంపెట్టని తత్వం - ఉపకారం చేయని ప్రవర్తన, అందర్నీ బాధించాయి. అందుకే ఎవరు మాత్రం సహాయం చెయ్యటానికి ముందుకువస్తారు? అవసరంలో, ఆపదలో ఒంటరిగా మిగిలింది ఎవరూ లేక!

అదే మరో వ్యక్తి వుంది! ఆమె పిలిచినా పిలవకున్నా అందరి విషయాల్లోనూ జోక్యం చేసుకుంటూ ఉపకారం చేస్తూ అందరి మంచి చెడ్డలూ తనవిగానే భావిస్తూ హెల్పింగ్ నేచర్‌గా ఉంటుంది. ఆమె కుటుంబానికి ఏ అవసరం వచ్చినా చుట్టుప్రక్కలవాళ్ళు రెడీగా ఉంటారు. ఉపకారం చేయటానికి, అప్పులు సహితం ఇవ్వటానికి. దీనికి కారణం మంచిగుణం - మంచి మనస్తత్వం - ఉపకార బుద్ధేకదా!

అందుకనే ప్రతిమనిషి తనకికానీ తనకుటుంబానికిగానీ ఎప్పుడు అవసరం వస్తుందోనని తెలుస్తూ ఉపకారం - మంచితనం - మంచిమాట - అలవరచుకుని ఇతరులతో సఖ్యంగా మెలగాలి. మంచి నడవడి అలవర్చుకోవాలి.